ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
శనివారం 18 మే 2024



# పురోగతి లేని మూడో ట్రాక్ పనులు

- తరుచూ రైళ్ల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- గత్యంతరం లేక బస్సులు, జీపుల్లో ప్రయాణం
- రవాణా చార్జీలు అధికమవుతున్నాయని ఆవేదన


మాకోడి-కాగజ్‌నగర్ వరకే పూర్తి అయిన మూడో ట్రాక్

కాగజ్‌నగర్, మే 17: సికింద్రాబాద్-ఢిల్లీ వరకు మూడో ట్రాక్ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించినప్పటికీ పనుల్లో పురోగతి లేదు. దీంతో తరుచూ రైళ్లను రద్దు చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మీదుగా నిత్యం హైదరాబాద్, వరంగల్‌కు 50ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా ప్రయాణికులు తమతమ గమ్యస్థానాలు చేరుకుంటారు. మూడో ట్రాక్ పనులు సికింద్రాబాద్-ఢిల్లీ వరకు చేస్తున్నారు. మాకోడి-కాగజ్‌నగర్, కాగజ్‌నగర్-రెబ్బెన, రెబ్బెన-తాండూరు, బెల్లంపల్లి-మంచిర్యాల, మంచిర్యాల-రామగుండం, పెద్దపల్లి-హసన్‌పర్తిరోడ్డు, కాజీపేట-సికింద్రాబాద్ బిట్స్‌గా చేసి మూడో ట్రాక్ పనులను చేపడుతున్నారు. మహారాష్ట్రలోని బల్లార్షా-మాకోడి వరకు ట్రాక్ పనులు నడుస్తుండగా, మాకోడి నుంచి కాగజ్‌నగర్ వరకు మూడో ట్రాక్ పనులు పూర్తిచేశారు. ఇందుకు ట్రయల్స్ కూడా పూర్తి చేశారు.

వేంపల్లి ట్రాక్ మధ్యలో పులుల బ్రీడింగ్ కేంద్రం ఉండటంతో నేషనల్ టైగర్ మానిటరింగ్ సెల్ బృందం సర్వేలను ఏడాది క్రితం చేపట్టింది. ఈ సర్వేల్లో అండర్ పాసింగ్ బ్రిడ్జి నిర్మించాలని సూచించింది. అలాగే ట్రాక్‌తో వన్యప్రాణులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుతం కాగజ్‌నగర్-రెబ్బెన, రెబ్బెన-తాండూరు వరకు మూడో ట్రాక్ పనులు నడుస్తున్నాయి. పనులు వేగంగా సాగటం లేదు. అలాగే తరుచూ ట్రాక్ మళ్లింపులు చేస్తుండటంతో ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నారు. ప్రతి రెండు నెలలకొకమారు పది రైళ్ల రద్దు చేయటంతో కాగజ్‌నగర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.గత్యంతరం లేక బస్సుల ద్వారా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు. రైలు ప్రయాణానికి, ఆర్టీసీ ప్రయాణానికి మూడురెట్లు అదనంగా ప్రయాణ చార్జిలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు.

మూడో ట్రాక్ పనులు నిరంతరం కొనసాగించి పూర్తిచేస్తే సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రైళ్లు నిర్ణీత సమయంలో వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం భాగ్యనగర్, పుష్‌పుల్ రైళ్లను రద్దు చేశారు. మంచిర్యాల, కాజీపేట, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వారు ఉదయం పూటనే భాగ్యనగర్, ప్యాసింజర్ రైలు ద్వారా వెళ్లేవారు. ప్రస్తుతం ఈ రెండు రైళ్లు రద్దు చేయటంతో ఆటోలు, జీపులు, ఆర్టీసీ బస్సుల ద్వారా వెళ్తున్నారు. ఈ మార్గంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి అయినప్పటికీ కూడా మూడో ట్రాక్ పనులు ఇంకా పూర్తి కావటం లేదు.

### మూడోట్రాక్ పనులు త్వరగా పూర్తి చేయాలి..

**లెండుగురే శ్యాంరావు, కాగజ్‌నగర్**




మూడో ట్రాక్ పనులు ఆశించిన మేర నడువటం లేదు. తరుచూ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైలు రద్దు చేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమున్న వారు జీపులు, ఆటోలు, బస్సుల ద్వారా పోవాల్సి వస్తోంది. చాలా కష్టం అవుతుంది. రైలు ప్రయాణం అందరికి ఉపయోగపడేట్టు ఉంటుంది. బస్సు ప్రయాణం మూడింతలు అధికమవుతోంది. చాలా కష్టమవుతోంది.

### నాన్‌స్టాప్ ప్రయాణం..

మూడు ట్రాక్ పనులు పూర్తి అయితే సికింద్రాబాద్-ఢిల్లీ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు ఎలాంటి అడ్డు లేకుండా నేరుగా వెళ్లేందుకు చక్కటిమార్గం ఉంటుంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు వచ్చే రైలు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో మంచిర్యాల వరకు బాగానే వస్తుండగా, బెల్లంపల్లికి రాగానే ఇతర ఎక్స్‌ప్రెస్‌లు వస్తుండటంతో వివిధస్టేషన్లలో హాల్ట్ ఇస్తున్నారు. దీంతో కాగజ్‌నగర్‌కు రాత్రి 10గంటలకు రావాల్సిన భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయానికి ఎన్నడూ రావటం లేదు. అదనంగా గంట సమయం తీసుకుంటుందని పలువురు పేర్కొంటున్నారు. మూడోట్రాక్ పనులు పూర్తిచేస్తే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్‌ఫాస్టు రైళ్లు ఆగకుండా పోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు వెంటనే స్పందించి మూడోట్రాక్ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.


నిర్మించిన మూడో ట్రాక్


మూడో ట్రాక్ పనుల కోసం తెచ్చిన మెటీరియల్

## పనుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్ రూరల్, మే 17: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవవహరించాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు, విద్యా, పౌరసరఫరాలశాఖ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పనులనిర్వహణ, ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ధరణి, ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. వరిధాన్యం కొనుగోలు చేసి నిర్ణయించిన మద్దతు ధరను అందించాలన్నారు. ఈ క్రమంలో ప్రతిరైతు లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 685ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేపట్టామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, తరగతి గదుల మరమ్మ తులు, బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు తదితర పనులపై నాణ్యతపాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 37కొనుగోలు కేంద్రాలద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రజావాణి, ధరణిలో వచ్చినసమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి,దాసరి వేణు, ఆర్డీవోలు సురేష్, డీఈవో అశోక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కౌటాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం


పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందంసభ్యులు

కౌటాల, మే 17: కౌటాల గ్రామ పంచాయతీని గురువారం కేంద్ర భూగర్భగనులశాఖ, కేంద్ర జలసంఘం అధికార బృందం సందర్శించింది. దేశవ్యాప్తంగా ఉత్తమ గ్రామపంచాయతీ ఎంపికలో భాగంగా కౌటాల గ్రామ పంచాయతీని కేంద్ర జలసంఘం సీనియర్ శాస్త్రవేత్త దివాకర్ మహంతా, సబ్‌డివిజన్ ఇంజనీర్ సతీష్‌కుమార్ బృందం సందర్శించింది. దేశ వ్యాప్తంగా 185గ్రామాలు ఎంపిక చేయగా నేషనల్ వాటర్ అవార్డు కోసం ఈ ఎంపిక జరుగుతుండగా ఇప్పటికే దేశవ్యాప్తంగా 25గ్రామాలను పునఃపరిశీలిస్తున్నారు. దక్షణ భారత దేశంలో ఎనిమిది గ్రామాలు ఎంపిక కాగా అందులో ఏడు గ్రామాలు తెలంగాణ నుంచే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఏడు గ్రామాల్లో కౌటాల పంచాయతీ ఎంపికకాగా ఇక్కడి వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. ఇందులో వర్షపు నీరు ఒడిసిపట్టి భూమిలో ఇంకేలా చేసిన పనులలను పరిశీలించారు. గ్రామంలోనిర్మించిన ఇంకుడుగుంతలు ఏ విధంగా పనిచేస్తున్నాయని అదే విధంగా కంకాలమ్మ గుట్టపై నుంచి వచ్చే నీటిని ఏ విధంగా నిలువ చేస్తున్నారో పరిశీలించారు. ఈ అవార్డు ఎంపికలో నీటిసంరక్షణ, వినియోగం, వినూత్న ఆలోచనలు, ఉపాధి కల్పన, పథకాల అమలు అన్నిటిని కలిపి 100మార్కులు ఇస్తామన్నారు. వాస్తవ పరిస్థితులపై కేంద్రానికి నివేదిక అందజేస్తామన్నారు. దీనిద్వారా అవార్డు ఎంపిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఐటీసీ కో ఆర్డినేటర్ మల్లేష్, ఎంపీపీ విశ్వనాథ్, టీంసభ్యుడు పోశెట్టి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీవో పూర్ణిమ, డీటీ సంతోష్, వాటర్‌షెడ్ ఈవో షైమద్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

## నేషనల్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ


గోల్డ్ మోడల్‌తో విద్యార్థిని స్ఫూర్తి

చింతలమానేపల్లి, మే 17: మండలంలోని కర్జవెల్లికి చెందిన అగాడి నారాయణ, మోహిని దంపతుల కుమార్తె స్ఫూర్తి ఈ నెల 15నుంచి 17వరకు నేపాల్‌లో ఇండియా, నేపాల్ మధ్య జరిగిన నేషనల్ సాఫ్ట్‌బేస్ బాల్ పోటీల్లో మంచిప్రతిభ కనబర్చి గోల్డ్ మోడల్ సాధించినట్లు తెలంగాణ సెక్రెటరీ దుర్గం గురువేందర్ తెలిపారు. కాగా స్ఫూర్తి సిర్పూర్(టి) బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుండగా చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి కనబర్చింది. కాగా జాతీయ పోటీల్లో ప్రతిభ కబర్చడం పట్ల స్ఫూర్తిని పలువురు అభినందించారు.

## కాపర్‌వైర్‌కోసం ఎత్తిపోతలకు నిప్పుపెట్టిన దొంగలు


కాలిపోతున్న గుండాయిపేట లిఫ్టు ఇరిగేషన్

కౌటాల, మే 17: మండలంలోని గుండాయిపేట గ్రామంవద్ద రైతుల సౌకర్యార్థం నిర్మించిన లిఫ్టు ఇరిగేషన్‌ను కేవలం కాపర్‌వైర్‌కోసం దొంగలు తగులబెట్టారు. రైతుల అభివృద్ధికోసం నాలుగువేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు గతంలో గుండాయిపేట లిఫ్టుఇరిగేషన్‌ను నిర్మించారు. లిఫ్టు ఇరిగేషన్‌కింద కొన్నిసంవత్సరాలుగా వేలఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. దొంగలు లిఫ్టు ఇరిగేషన్‌పై కన్నేసి గతంలో కొన్ని వస్తువులు దొంగలించారు. అప్పటినుంచి రైతులు లిఫ్టుఇరిగేషన్‌ను కాపాడేందుకు గస్తీ నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం లిఫ్టుఇరిగేషన్ మరమ్మతుల కోసం గ్రామస్తులు రూ.2లక్షలు ఖర్చు చేయగా అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మరో రూ.2లక్షలు చేర్చి లిఫ్టు ఇరిగేషన్‌ను బాగుచేయించారు. అప్పటినుంచి లిఫ్టు ఇరిగేషన్ నడుస్తోంది. ఈమధ్యలో మరమ్మతులు చేయాల్సి ఉండగా సాంకేతిక నిపుణులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి దొంగలు కాపర్‌వైర్ కోసం లిఫ్టు ఇరిగేషన్‌కు నిప్పు పెట్టారు. లిఫ్టు ఇరిగేషన్‌ను వస్తువులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. కేవలం కాపర్‌వైర్ కోసం లిఫ్టు ఇరిగేషన్‌ను తలగబెట్టడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాలల ప్రారంభంలోగా ఏకరూప దుస్తులు అందజేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, మే 17: విద్యార్థులకు ఏకరూప దుస్తులను జూన్12వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తుల కోసం పంపిణీ చేసిన గుడ్డను జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం కంటే ముందే ఏకరూపదుస్తులు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థుల కొలతల ఆధారంగా గుడ్డ అందజేయాలని సూచించారు. మండలాల్లో ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా పని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌మాట్లాడుతూ జిల్లాలో 25,322 మంది విద్యార్థినులు, 22,926 మంది విద్యార్థులకు మొత్తం 48248విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. దీనికిగాను 1,96,031 మీటర్ల బట్టను కత్తిరించి రేపటిలోగా మండలాలకు చేరే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఏర్పాటుచేసిన వివిధసెంటర్లలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబర్లతో ఏకరూప దుస్తులని కుట్టిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్‌డైరెక్టర్ రామకృష్ణ, సమగ్రశిక్ష కోఆర్డినేటర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్‌మండలం అడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వేసవిదృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించి తగురక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలోని పండ్లమొక్కలకు సంబంధించినవివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, కార్యదర్శిసిబ్బంది పాల్గొన్నారు.

### పనులు నాణ్యతతో చేయాలి

కెరమెరి: అమ్మఆదర్శ పాఠశాలల్లో పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాలలో మహిళాసంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. వచ్చేవిద్యా సంవత్సరంలోగా పాఠశాలల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. మహిళలు తమతమ గ్రామాల్లో పనులు చేసి ఆర్థికస్వావలంభనదిశగా అడుగులు వేయాలని సూచించారు. అలాగే గోయగాం స్కూల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో పాఠశాల సముదాయం కోసం మహిళలు, పాఠశాల విద్యార్థులకోసం యూనిఫాం కుట్టే కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలు ప్రారంభయ్యే నాటికి విద్యార్థులకు దుస్తులు కుట్టేప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణబిల్లులు రాలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో గ్రంథాయంలో పోటీపరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరడంతో అన్నిరకాల పుస్తకాలు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయనవెంట డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్‌పాషా, ప్రకాష్, ఏఈ అజీమోద్దీన్, కార్యదర్శి బొజ్జిరావు, ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీష్ తదితరులు ఉన్నారు.


కెరమెరిలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే




## ఆర్కే ఓసీపీలో మిషన్ లైఫ్ కార్యక్రమం

రామకృష్ణాపూర్, మే 17: రామకృష్ణాపూర్ ఓసీపీ నందు శుక్రవారం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా హరితర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఎం గోవిందరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్రతిఒక్కరు తమ జీవన శైలిని మార్చుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్కే ఓసీపీ మేనేజర్ సుధీర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఆంజనేయులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రాజెక్టు అధికారి గోవిందరావు, తదితరులు

## ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి: జీఎం

శ్రీరాంపూర్, మే 17: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం, మిషన్ లైఫ్ పర్యావరణ అవగాహన సందర్భంగా శుక్రవారం ఆర్కే8 డిస్పెన్సరీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం డిస్పెన్సరీల్లో అన్ని వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక పరికరాలు ఉన్నాయని, వినియోగించుకోవాలని కోరారు. రక్తపోటును నియంత్రించుకోవడానికి ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. ఆహారంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఇప్పటినుంచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు జీఎం బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డాక్టర్ మురళీధర్, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మైదానాన్ని పరిశీలించిన జీఎం..

న్యూనాగార్జునకాలనీలో ఉన్న ప్రాణహిత మైదానాన్ని జీఎం బి సంజీవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఉద్యోగులు, పరిసరప్రాంత ప్రజల సౌకర్యార్థం అన్నిహంగులతో మైదానాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేయాలని, లైటింగ్ మెరుగుపర్చాలని, మైదానంలోకి వాహనాలు, పశువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, ఇంజనీర్లు సతీష్ చక్రవర్తి, సత్యనారాయణ, సీనియర్ పీవో కాంతారావు, స్టోర్స్ సూపర్‌వైజర్ చాట్లఅశోక్, కో-ఆర్డినేటర్ తోటసురేష్, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయండి..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు నిండుకున్నందున సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యుడు, మంచిర్యాల రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి వి మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ కారణంగా రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు తగ్గిపోయాయని తెలిపారు. దీంతో సికిల్‌సెల్, తలసే మియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, అత్యవసరంగా రక్తం అవసరం ఉన్న వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో పలుమార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి పెద్దమొత్తంలో రక్తం అందిస్తున్నట్లు తెలిపారు. వెంటనే నూతనంగా శిబిరం ఏర్పాటు చేసి కార్మికుల నుంచి రక్తం సేకరించి తమకు అందజేయాలని కోరారు. ఆయన విజ్ఞప్తికి జీఎం సానుకూలంగా స్పందించారు. మధుసూదన్‌రెడ్డి వెంట ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ కార్యదర్శి చందూరి మహేందర్ ఉన్నారు.


రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇస్తున్న మధుసూదన్ రెడ్డి

## కార్మికులపై పని ఒత్తిడి తగ్గించండి

శ్రీరాంపూర్, మే 17: కార్మికులపై పనిఒత్తిడి తగ్గించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆర్కే5 గనిని యూనియన్ నాయకులు సందర్శించి కార్మికులసమస్యలు తెలుసుకున్నారు. మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొంతమంది అధికారులు, కొంతమంది కార్మికులను లక్ష్యంగా చేసుకొని ఉద్దేశపూర్వకంగా పనిభారం మోపుతూ ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను వెంటనే మానుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. పని స్థలాల్లో వెంటిలేషన్ సౌకర్యం కల్పించాలని, టూల్‌బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మ్యాన్ రైడింగ్‌ను నిర్ణీత సమయంకంటే పది నిమిషాల ముందు నడిపించాలని, క్యాంటీన్‌లో మెరుగైన వసతులు కల్పించాలని, రెస్ట్‌హాల్, లాకర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్రఉపాధ్యక్షుడు కలవేనశ్యాం, కార్యదర్శి మల్లారెడ్డి, ఏరియా కార్యదర్శులు చందు, మోహన్, సదయ్య, మహేందర్ రెడ్డి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

కాసిపేట, మే 17: రెండు నెలల క్రితం కాసిపేట 2వ గనిలోవిధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందిన సీనియర్ మైనింగ్‌సర్దార్ మచ్చ రమేష్ కుటుంబానికి గనికార్మికులు శుక్రవారం రూ.1.10లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్లశ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీ సుభాష్‌చంద్రబోస్, మైనింగ్ సర్దార్‌కేతన్, వినోద్, టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి, సీఐటీయూనాయకులు సురేష్, కారుకూరి తిరుపతి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

భీమారం, మే 17 : భీమారంలోని రాజన్న, కుమార్, శేషు, రాజన్నలు ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా వీరిని శుక్రవారం పలువురు పరామర్శించారు. ఉస్కమల్ల పున్నంచంద్ నలుగురికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున రూ. 16 వేలు అందించారు. అలాగే పోలంపల్లి మాజీ సర్పంచు దర్శనాల రమేష్ రూ.2 వేలు, మండల నాయకులు బుక్య లక్ష్మణ్, ప్రకాష్‌రెడ్డిలు నిత్యవసర సరుకులను అందించారు. కాంగ్రెస్ నాయకులు పోడేటి రవి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీపీ అధికారి ఆత్మహత్య



కిరిటీ (ఫైల్)

జైపూర్, మే 17: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో డీవైఎస్ఈ (మెకానికల్)గా పనిచేస్తున్న కిరిటీ(37) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. థర్మల్ ప్లాంటు ఆవరణలో ఎంటీ క్వార్టర్ నెంబర్ 13లో కిరిటీ-శృతి దంపతులు నివాసం ఉంటున్నారు. ఏఅండ్ఎం, స్టోర్స్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న కిరిటీ ఉదయం విధులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. సాయంత్రం తోటి అధికారులు ఇంటి తలుపులు కొట్టినా సమాధానం రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా లోపల ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపులు పగులగొట్టి చూడగా కిరిటీ అప్పటికే మృతి చెందాడు. కిరిటీ భార్య ఇటీవల హైదరాబాద్‌కు వెళ్ళగా ఒకడే ఉంటున్నాడు. సంఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీధర్‌లు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి రఘురామచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య శృతి, కుమారుడు క్రితిక్ ఉన్నాడు. కాగా పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకొన్నారు. అందులో స్టోర్స్‌లో పని ఒత్తిడి కారణంగా కుటుంబంతో గడపలేక పోతున్నానని, స్టోర్స్‌లో విలువైన వస్తువులు మాయమైన విషయంలో విజిలెన్స్ అధికారి వేధిస్తుండడంతో అవమానం భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఉందని ఏసీపీ తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు

జన్నారం, మే 17 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మంచిర్యాల జిల్లా కోకన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జన్నారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రకటించిందన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున వెంటనే 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌వర్మ, నరసయ్య, లక్ష్మీనారాయణ, శ్రీదర్, రవి, నాగేందర్, మల్లేష్, నరేష్, సంతోష్, శ్రీనివాస్, శ్రీదర్‌రావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీసీలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఇబ్బందులు



సీసీసీ చౌరస్తా

నస్పూర్, మే 17: సీసీసీ కార్నర్ వద్ద పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీసీ కార్నర్ వద్ద ప్రయాణికుల కోసం ఆర్టీసీ లేదా చుట్టుపక్కల వ్యాపారుల కోసం మున్సిపాలిటీగాని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉన్నా అధికారులు కాలయాపన చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్, వరంగల్, భూపాల్‌పల్లి, గోదావరిఖని, కరీంనగర్ ప్రాంతాలకు ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. చిరు వ్యాపారులు ఉదయం నుంచి రాత్రి వరకు వ్యాపారాలను కొనసాగిస్తుంటారు. అంతే కాకుండా ఆటో అడ్డా కూడా ఉండడంతో ప్రయాణికులు చాలా సేపు ఇక్కడ వేచి ఉంటారు. కాలకృత్యాలను తీర్చుకునేందుకు పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రయాణికుల, చిరు వ్యాపారుల సౌకర్యార్థం సీసీసీ కార్నర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## పౌరసరఫరాల శాఖ అధికారిని కలిసిన రేషన్ డీలర్లు



డీసీఎస్‌వో హరికృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రేషన్‌డీలర్ల సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 17: మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి పౌర సరఫరాల శాఖ అధికారిగా వచ్చిన హరికృష్ణను శుక్రవారం జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎం గోపాల్, రేషన్ డీలర్ల నాయకులు మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, మే 17: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, నాన్‌ఇంజనీరింగ్ కోర్సుల్లో మొదటిదఫా అడ్మిషన్లకోసం ఆన్‌లైన్ ద్వారా 100రూపాయల రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐటీఐవెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈనెల16నుంచి జూన్10వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సిర్పూర్(టి), మే 17: మండల కేంద్రంలోని డౌసల్ ఏరియాలోగల సయ్యద్ తాలీబ్‌అలీషాబాబా దర్గావద్ద శని, ఆదివారాల్లో జరగనున్న ఉర్సుఉత్సవాల కోసం దర్గాకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లుఅన్ని పూర్తిచేశారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఉమర్‌షరీఫ్

లింగాపూర్, మే 17: మండలంలో గురువారం సాయంత్రం సంభవించిన ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి మండలంలోని కీమానాయక్‌తండా, నడంగూడా, నాగుగూడా, లింగాపూర్, తదితర గ్రామాల్లోని ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కీమానాయక్‌తండాలోగల బానోత్ భంగిబాయి, జాదవ్ రాజేందర్ ఇళ్లలో నిత్యావసర సరుకులు పూర్తిగా తడిచిపోయాయి. మానవతా ధృక్పతంతో మండల పంచాయతీ అధికారి, ఉమర్ షరీఫ్, ఎమ్మార్వో రాజేంద్రప్రసాద్ వారికి నిత్యావసర సరు కులు పంపిణీ చేశారు.

## ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడి ఆత్మహత్య



ఉమేష్(ఫైల్)

వాంకిడి, మే 17: తనకు ఇష్టం లేని పెళ్లి చేశారని మనస్థాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సఘటన వాంకిడి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సైసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన వడై ఉమేష్(27)తో సుర్థాపూర్ గ్రామానికి చెందిన పోశెట్టి రెండో కుమార్తెతో ఈనెల 5న పెళ్లి చేశారు. ఇంట్లో కూలర్ మోటారు పనిచేయడం లేదని, కొత్తమోటారు తీసుకు వస్తానని చెప్పి గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన ఉమేష్ మధ్యాహ్నం తండ్రికి ఫోన్ చేసి నేను మన కూరగాయలతోటలో పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో వెంటనే తండ్రి అక్కడికి చేరుకుని చూసే సరికి చెట్ల కింద కూర్చొని ఉన్నాడు. పురుగుల మందు ఎందుకు తాగావని అడుగగా తనకు ఇష్టం లేని పెళ్లి చేశారని పురుగుల మందు తాగినని చెప్పాడు. వెంటనే ఉమేష్‌ను ద్విచక్రవాహనంపై ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎలుగుబంటి హతం



ఎలుగుబంటి కళేబరం

పెంచికలపేట, మే 17: పెంచికలపేట రేంజ్‌పరిధిలోని అటవీప్రాంతంలో ఎలుగుబంటి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగర్‌గూడ గ్రామ సమీప అటవీప్రాంతంలో బుధవారం అటుగా వెళ్తున్న గ్రామస్తులు ఎలుగుబంటి కళేబరం గమనించి అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖాధి కారులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఎలుగు బంటి తల, వీపుపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ఎవరైనా ఉచ్చులు బిగించి హతమార్చారా? లేక విద్యుత్ షాక్‌తో హతమార్చారా? ఆత్మరక్షణలో భాగంగా చంపేశారా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. పశువైద్యులతో పంచనామా అనంతరం ఎలుగుబంటి కళేబరాన్ని ఫోరానిక్స్ ల్యాబ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా ఎలుగు బంటి వయసు ఆరు సంవత్సరాలు ఉంటుందని, ఎలుగు బంటి మృతిచెంది మూడురోజులు గడుస్తున్నా అటవీ శాఖాధికారులు సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు



హారతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కాగజ్‌నగర్, మే 17: పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కుంకుమపూజ, హోమ కార్యక్రమాలను పండితులు షణ్ముకచారి ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం ప్రసాదవితరణ, మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు స్వీట్లు



కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్‌రూరల్, మే 17: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్నిడిపోలలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులకు సీట్లు పంపిణీ చేశారు. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.24.23కోట్ల ఆదాయం తెచ్చినందుకు స్వీట్లు పంపిణీ చేశారన్నారు. కార్యక్ర మంలో డిపోమేనేజర్ విశ్వనాథ్, ఎస్టీఐ సరియా పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

ఆసిఫాబాద్ రూరల్, మే 17: ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను చంపేసిందో భార్య. ఈ సంఘటన మండలంలోని రహపల్లిలో కలకలం రేపింది. మృతుడి అన్న ఆనందరావు తెలిపిన వివరాల ప్రకారం.. చునార్కర్ రవీందర్(38), కళావతి భార్యభర్తలు. కళావతి గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్‌తో తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ విషయమై రవీందర్ కళావతిని ప్రశ్నించేవాడు. ఇదే విషయమై కొన్ని సందర్భాల్లో గొడవలు జరిగేవి. గతంలో ఈ విషయమై పంచాయతీ కూడా జరిపారు. ఈక్రమంలో గురువారం కూడా గొడవ జరిగింది. ఇదే క్రమంలో తన తమ్ముడు రవీందర్‌ను ప్రియుడితో కలిసి కళావతి తన తమ్ముడిని ఇంట్లో ఉరివేసి చంపినట్లు తెలిపారు. మరదలు, ప్రియుడిపై పోలీసు స్టేష న్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

## నాటుసారా పట్టివేత

సిర్పూర్(టి), మే 17: సిర్పూర్(టి)గ్రామంలో శుక్రవారం వాహనాల తనిఖీలో భాగంగా చింతకుంట గ్రామానికి చెందిన అజ్మీర తిరుపతి మోటారు సైకిల్‌పై తరలిస్తున్న పదిలీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐరవి తెలిపారు. ఈదాడుల్లో ఎక్సైజ్ఎస్సై సురేష్, సిబ్బంది మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

## అనాథబాలిక ఆశ్రమంలో చేర్పింత

ఏసీసీ/చింతలమానేపల్లి, మే 17: మతిస్థిమితం లేని యువతికి మంచిర్యాల జిల్లాకేంద్రంలోని కల్వరీ యువశక్తి అనాధ ఆశ్రమం నిర్వాహకులు ఆశ్రయం కల్పించారు. వివరాల్లోకి వెళితే కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన నాయిని కీర్తి తల్లిదండ్రులు నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయారు. తల్లిదండ్రులు చనిపోవడంతో బాలిక నా అనే వారు ఎవరూ లేక మానసికంగా కుంగిపోయింది. కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ప్రవరిస్తోంది. ఈ విషయాన్ని బాబాసాగర్ సర్పంచు భీమేష్, చింతలమానేపల్లి ఎస్ఐ నరేష్‌కు తెలుపగా స్పందించిన ఎస్ఐ మంచిర్యాల జిల్లాకేంద్రంలోని కల్వరీ యువశక్తి అనాథాశ్రమం వ్యవస్థాపకుడు ముల్కల్ల కుమార్‌ను సంప్రదించడంతో స్పందించిన ఆయన శుక్రవారం బాబాసాగర్‌కు వెళ్లి పోలీసులు, సర్పంచు సమక్షంలో బాలికను ఆశ్రమంలో చేర్చుకున్నారు. మతి స్థిమితం లేని బాలికకు ఆశ్రయం కల్పించిన కుమార్‌ను పలువురు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట, మే 17: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మంచిర్యాల నుంచి రెబ్బెనకు కూల్‌డ్రింక్స్ లోడుతో వెళ్తున్న ఐచర్ వ్యాన్ డ్రైవర్ మంగళి ప్రసాద్ అతి వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో వ్యాన్ క్యాబిన్‌లో ఉన్న కూలీలు హన్మకొండ జిల్లా నడికుడి గ్రామానికి చెందిన జగన్నాధుల దేవేందర్ (33) అక్కడికక్కడే మృతి చెందగా మరో కూలీ తుంగపిండి రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన రమేష్ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు

లక్షెట్టిపేటరూరల్, మే 17: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం నెల్కి రామయ్య, మేరుగు లచ్చన్న అనే రైతులకు చెందిన నాలుగు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లోకి గేదెలు మేతకు వెళ్లగా అప్పటికే విద్యుత్ తీగలు ఆ ప్రాంతంలో పడి ఉన్నాయి. గేదెలు మేత మేస్తూ తీగలకు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందినట్లు తెలిపారు. గేదెల విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

**దండేపల్లి:** కన్నెపల్లి గ్రామానికి చెందిన అక్కల మల్లేష్ అనే రైతుకు చెందిన గేదె గ్రామ శివారులో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. మేత మేస్తుండగా పొలం ఒడ్డున ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగలడంతో మృతి చెందింది. దీని విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని, నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

## అట్రాసిటీ కేసు నమోదు

ఏసీసీ, మే 17 : మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఉండే కాంపెల్లి ఆంజనేయులుపై దాడి చేసి కులం పేరుతో దూషించిన మేడి నర్సయ్య, మేడి శ్రీనివాస్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. మేడి నర్సయ్య, మేడి శ్రీనివాస్‌లు కొంత కాలంగా కార్మెల్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. సర్వే నెంబరు 223లో పట్టాదారైన కాంపెల్లి ఆంజనేయులును కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారన్నారు. అంజనేయులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బెల్లం పానకం ధ్వంసం

వేమనపల్లి, మే 17 : మండలంలోని బుయ్యారం అటవీ ప్రాంతంలో గుడుంబా తయారీ కోసం సిద్ధంగా ఉన్న 4200 లీటర్ల బెల్లం పానకాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు అడవిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు సకాలంలో దుస్తులు అందజేయాలి



మహిళ సంఘాలకు క్లాత్‌ను అందజేస్తున్న ఎంపీడీవో, మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

భీమిని, మే 17: విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలని ఎంపీడీవో గంగ మోహన్ సూచించారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో టైలరింగ్ సెంటర్ ప్రారంభించి వారితో మాట్లాడారు. మండలంలో 3200 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడానికి టైలరింగ్ ప్రారంభించి ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. ఇన్‌చార్జి డీఎల్‌పీవో సఫ్దర్ అలీ, ఏపీఎం ప్రకాష్ గౌడ్, ఐకేపీ సీసీ తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్:** విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులను అందజేయాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఏకరూప క్లాత్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 42 పాఠశాలల్లోని 1723 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను పాఠశాల ప్రారంభంలోగా అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ అవకాశం కల్పించాలని, మహిళ సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**తాండూర్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసే ఏకరూప దుస్తులను పాఠశాలలు ప్రారంభమయ్యే సరికి అందజేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. కిష్టంపేట పంచాయతీలోని రాజ్యలక్ష్మీ కుట్టు కేంద్రం ఏజెన్సీ ద్వారా ఏకరూప దుస్తుల కుట్టు పనులను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఏకరూప దుస్తులను జూన్ 10లోగా పూర్తి చేయాలని తెలిపారు.ఎంఈవో వాసాల ప్రభాకర్, ఏపీఎం పోమానాయక్, ఐకేపీ మహిళలు, సిబ్బంది, సీఆర్‌పీ నాగరాజు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే యూనిఫాంల కుట్టు కేంద్రాన్ని ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోగా యూనిఫాంలు కుట్టి పాఠశాలలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఏపీఎం లలితకుమారి, సీసీలు చారి, విజయనిర్మల తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి



కనకబాదు (ఫైల్)

కాసిపేట, మే 17: సోనాపూర్ పంచాయతీలోని బాదుగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గ్రామ పటేల్ కనక బాదు (78) గురువారం రాత్రి ఇంట్లో మృతి చెందాడు. రెండేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. బాదు అన్నదమ్ములతో కలిసి సొంతంగా ఊరునే నిర్మించాడు. దీంతో గ్రామానికి బాదుగూడగా నామకరణం చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేశాడు. గిరిజన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో క్రీయాశీలక పాత్ర పోషించి ప్రతీ గిరిజనుడుకి పక్కా ఇండ్లు వచ్చేలా కృషి చేశాడు. రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

## దుకాణాల్లో దొంగ బీభత్సం

లక్షెట్టిపేటరూరల్, మే 17: లక్షెట్టిపేట పట్టణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు 9 దుకాణాల్లో చోరీకి పాల్పడి రూ.30 వేలు దోచుకెళ్లాడు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఏరియాలోని గాయత్రి లేడీస్ ఎంపోరియం, పద్మఫోటో స్టూడియో, సాయిశ్రీ జిరాక్స్ టైప్ ఇన్‌స్టిట్యూట్, ఉత్కూరు చౌరస్తాలోని రాయల్ టీ పాయింట్‌తోపాటు పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డాడు. దుకాణాల వెనుక వైపు తలుపులు ఊడదీసి లోపలికి చొరబడి డబ్బులు దొంగలించినట్లు సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు. శుక్రవారం పోలీసులు క్లూస్‌టీంలతో చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

## ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



చేతి పంపునకు మరమ్మతు

మందమర్రిరూరల్, మే 17: మంచిర్యాల జిల్లా పేజీలో నిరుపయోగంగా చేతి పంపు అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. సారంగపల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న చేతి పంపునకు శుక్రవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

దండేపల్లి, మే 17: వానాకాలం సీజన్‌గాను పచ్చిరొట్ట విత్తనాలు గూడెం, నెల్కివెంకటాపూర్ ప్రాథమిక సహకార సంఘం, దండేపల్లిలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని. రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి గొర్ల అంజిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగు విత్తనాలు 30 కేజీల బ్యాగ్ ధర రూ. 1,116, జీలుగు విత్తన బ్యాగులను రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగు రైతులకు అందజేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు క్లస్టర్ల ఏఈవోలకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ అందజేయాలమన్నారు. శనివారం నుంచి రైతులకు పచ్చిరొట్ట ఎరువులను అందజేస్తామన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 17: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వీబీఏ, టీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కేంద్రాల్లో ఉంచడంతో వర్షాలు పడినప్పుడు తడిసి రైతులు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, హన్మంతు, మల్లేష్, రమేష్, లింగన్న, సంతోష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు సెంటర్ ప్రారంభించాలి

చెన్నూరు, మే 17 : చెన్నూరు పట్టణంలో ఆధార్ నమోదు సెంటర్‌ను ప్రారంభించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు శ్రీనివాస్, వెంకటనర్సయ్యలు శుక్రవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ త్వరలో ఆధార్ నమోదు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

## ఒకరి రిమాండ్

జన్నారం, మే 17: తపాలపూర్ బీట్‌లో ఆత్రం చిన్న రాజం అనే వ్యక్తి టేకు చెట్టు నరకడంతో ఆయనపై కేసు నమోదు చేసి శుక్రవారం లక్షెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఎస్‌వో గోపికృష్ణ తెలిపారు. అడవిలో చెట్లను నరికితే చర్యలు ఉంటాయని తెలిపారు. బీట్ అధికారులు శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి




సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 17: అమ్మఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్, తదితర మరమ్మతు పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను పాఠశాలల ప్రారంభానికి అందించాలన్నారు. జూన్ 12 లోగా అభివృద్ధి పనులు, పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను రోజు పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందించేందుకు కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాల సభ్యులతో దుస్తులు తయారు చేయిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, డీఈవో యాదయ్య, పౌరసరఫరాల మేనేజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత మానసిక ధృఢత్వాన్ని అందిస్తుంది

ఏసీసీ, మే 17: భగవద్గీత మానసిక ధృఢత్వాన్ని అందిస్తుందని హరేకృష్ణ , ఇస్కాన్ ప్రచారకులు రాధాకృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హిందు సేవక్ సమాజ్ ఫౌండేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి, దేశానికి భగవద్గీత ఆదర్శమన్నారు. సమాజంలో వివిధ వర్గాల వారు ధర్మ ప్రవర్తనతో నడిచేందుకు భగవద్గీత దారి చూపుతుందన్నారు. గోవులు, స్త్రీలు, పిల్లలను గౌరవించడంతో పాటు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, న్యాయవాది కొట్టె నటేశ్వర్, సేవక్ సమాజ్ డైరెక్టర్ విజయభాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చింతలమానేపల్లి, మే 17: మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ డీలర్లు నకిలీవిత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు విత్తనాలు అమ్మినసమయంలో ఖచ్చితంగా రశీదు ఇవ్వాలన్నారు. రైతులు కూడా బిల్లులను పంటకోతకు వచ్చే వరకు భద్రపర్చుకోవాలన్నారు. నకిలీవిత్తనాలు అమ్మినట్లయితే లైసెన్సు రద్దు చేస్తామని, అధికధరలకు విత్తనాలు విక్రయిస్తే వ్యసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయనవెంట ఏవో రామకృష్ణ, డీలర్లు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ రూరల్, మే 17: మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ తరపున ఇవ్వనున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళాశిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమాధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు 6నుంచి 18సంవత్సరాలలోపు బాలబాలికలు అర్హులని, ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజికసేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు ఇతర రంగాల్లో ప్రతభ చూపిన బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ఐదవ రోజు బంద్ ప్రశాంతం

జైనూర్, మే 17: మండల కేంద్రంలో శుక్రవారం ఐదో రోజుబంద్ ప్రశాంతంగాకొనసాగింది. హోటళ్లు, దుకాణాలు వ్యాపార సముదాయాలను పూర్తిగా బంద్‌చేశారు. అవాంచ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందో బస్త్ నిర్వహించారు.

## చలో బస్ భవన్‌ను విజయవంతం చేయండి

ఆసిఫాబాద్ రూరల్, మే 17: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల21న తలపెట్టిన చలో బస్‌భవన్‌ను ఆర్టీసీకార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం చలో బస్‌భవన్‌కు సంబంధించిన కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు దివాకర్, అయూబ్, రాజన్న, పాషా, మల్లేష్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి, మే 17: వాంకిడి మండలంలో శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగ దారులు సహకరించాలని కోరారు.

# పలు మండలాల్లో కురిసిన వర్షం



బెజ్జూరులో కురుస్తున్న వర్షం

బెజ్జూరు/చింతలమానేపల్లి/పెంచికలపేట/దహెగాం, మే 17: పలు మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిన జనానికి కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కాగా కురిసిన వర్షం కారణంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. కాగా రైతులు యాసంగి పంట ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పెంచికలపేట మండలంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోతదశలో ఉన్న వరిపట నేలకొరిగింది. పలుగ్రామాల్లో అంతర్గతరోడ్లు బురదమయంగా మారాయి. సిర్పూర్(టి) మండలకేంద్రంలోని రహదారులు వరదనీటితో నిండిపోయాయి. మండల కేంద్రంలోని సాయిరాం రైస్‌మిల్లులో రైతులకు సంబంధించిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. రైతులు ధాన్యంను కాపాడుకునేందుకు కవర్లు కప్పేందుకు ఇబ్బందులుపడ్డారు. దహెగాం మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కల్వాడ గ్రామంలో వరిపంట నేలకొరిగింది. గిరివెల్లి, లగ్గాం, దహెగాం, ఒడ్డుగూడ, కుంచెవెల్లి గ్రామాల్లో వరి కొనుగోలుకేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కాపాడుకోవడానికి రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు. శుక్రవారంసాయంత్రం గాలిదుమారానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పెంచికలపేటలో కురుస్తున్న వర్షం



సిర్పూర్(టి)లో కురుస్తున్న వర్షం



సిర్పూర్(టి)లో ఇళ్లలోకి చేరిన వరద నీరు

## కోవ విజయ్‌ని అరెస్టు చేయడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి, మే 17: జైనూరులో జరిగిన గొడవలకు సంబంధించి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్య అని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తుడుందెబ్బ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ఆదివాసుల చట్టాలపై ఏ మాత్రం కూడా అవగాణ లేక ఓ మతానికి సపోర్టు చేస్తూ ఆదివాసీ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేయడంను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. విజయ్‌కుమార్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గణ పతి, వినోద్‌కుమార్, శోభన్, భీంరావు, జంగు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు తనిఖీ

చింతలమానేపల్లి, మే 17: చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో రామకృష్ణ ఉన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి



డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

ఆసిఫాబాద్ రూరల్, మే 17: గ్రామాల్లో ప్రజలకు వైద్యమందించడంలో ముఖ్యమైన ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని జిల్లా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లాని ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యల పరిష్కారంతోపాటు వైద్యసేవలో గుర్తింపు వచ్చేలా తనవంతు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల జిల్లా అధ్యక్షుడు రమేష్, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

### త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి..

పంటపొలాల్లో తాము వేసుకున్న బోర్‌వెల్‌లకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గుండి గ్రామస్థులు శుక్రవారం జిల్లా కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాల్లో బోర్‌వెల్ వేసుకున్నామని అయితే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వృధాగా వ్యవసాయం చేయలేకపోతు న్నామన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గుండి మాజీ సర్పంచ్ దత్తు, గ్రామ పటేల్ రాజు, రైతులు పాల్గొన్నారు.

## మహాత్మజ్యోతి బాపూలే జాతీయ అవార్డు ఎంపిక



పత్రాన్ని అందుకుంటున్న ప్రణయ్

ఆసిఫాబాద్ రూరల్,మే 17: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రధానం చేయనున్న మహాత్మజ్యోతి బాపూలే అవార్డుకు జిల్లా కేంద్రానికి చెందిన అవిడపు ప్రణయ్‌కి ఎంపి కైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. పూలే ఆలోచన విధానంతో ప్రణయ్ విద్యారంగ, నిరుద్యోగసమస్యలపై పోరాడుతున్నారని అన్నారు. సామాజికసేవా కార్యక్రమాల్లో కూడా తనదైనశైలిలో మంచి గుర్తింపు పొందుతున్నారన్నారు. చిన్నవయస్సులో సామాజికస్పృహతో బాధ్యతాయుతంగా విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. జూన్10న పూణెలో బహుజన సాహిత్య అకాడమి నిర్వహించే వెస్ట్రన్‌ఇండియా బహుజనరైటర్స్ 4వకాన్ఫరెన్స్ లో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ నగరంలో ప్రయణ్‌కి అవార్డు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

జైనూర్, మే 17: మండల కేంద్రంలో ఇటీవల ఇరు వర్గాలకు చోటుచేసుకున్న దాడి సంఘటనలో తీవ్రంగా గాయ పడిన మరుస్కోల లక్ష్మణ్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేస్రం షేకు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసా చట్టానికి విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనేతరుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు గేడాం మారుతి, అమృత్‌రావ్, సెడ్మకీ భగ్వంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.


**లింగాపూర్:** జైనూర్ మండలంలో ఆదివాసీ యువకుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడిచేసిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని లింగాపూర్ మండల మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కనక జ్యోతిరాం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దాడిచేసిన వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## నర్సరీలను సందర్శించిన ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిక ప్రసాద్

చింతలమానేపల్లి, మే 17: మండలంలోని బాబాసాగర్, చింతల మానేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీ లను శుక్రవారం ఎంపీ డీవో కోట ప్రసాద్ సంద ర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కల సంరక్షణపై పంచాయతీ అధికారులు శంకర్, ఆసీఫ్‌అలీలకు సూచనలు చేశారు.





# రుణమాఫీపై ఆశలు

- ఆగస్టు 15లోపు పంట రుణమాఫీ చేస్తామన్న సీఎం
- బ్యాంకర్లను వివరాలు కోరిన ప్రభుత్వం
- జిల్లాలో 2 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి

బెల్లంపల్లి, మే 17: రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ హామీ అమలు దిశ గా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15 లోగా పంట రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో 2 లక్షల మందికి పైగా రైతులకు రుణ మాఫీ కింద లబ్ధి చేకూరనుంది. దీంతో రైతుల్లో రుణమాఫీకి సంబంధించి ఆశలు చిగురిస్తున్నాయి.

## జిల్లాలో 2 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి

జిల్లాలో దాదాపు 2 లక్షల మందికి పైగా రైతులు రుణాలు తీసుకున్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా రైతులు రూ.512 కోట్ల 26 లక్షలు పంట రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను పంపించాలని బ్యాంకులను ప్రభుత్వం కోరింది. ఏప్రిల్ 1, 2019 నుంచి డిసెంబరు 10, 2023 మధ్య రూ.2 లక్షల రుణం తీసుకున్న రైతుల వివరాలను పంపించాలని ప్రభుత్వం బ్యాంకులను కోరింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నప్పటికీ ఆలస్యం కావడంతో కొన్ని రోజులు రైతులు ఆందోళన చెందారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత రుణమాఫీపై తేదీ ప్రకటించి స్పష్టత ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి

## పలువురు రైతుల్లో ఆందోళన

పంట రుణాల మాఫీ విషయంలో కటాఫ్ తేదీ అనేది ముఖ్యంగా పరిగణిస్తారు. ఏ తేదీని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందనే అంశంపై ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించలేదు. అలాగే రుణమాఫీకి సంబంధించిన నిబంధనలు తెలియకపోవడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ నిబంధనలు ఎలా ఉంటాయి అనేది తెలియలేదు. గతంలో రుణాలు తీసుకుని రెన్యువల్ చేయించుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వస్తుందని కొందరు చర్చించుకుంటున్నారు. రైతులందరికి రుణమాఫీ ఉంటుందని మరికొందరు పేర్కొంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు రైతులకు రుణమాఫీ వర్తిస్తుందో లేదోననే విషయంపై సైతం ఇప్పటి వరకు స్పష్టత లేదు. దీంతో పలువురు రైతులు అయోమయంలో ఉన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా మొత్తం రైతుల రుణాలు మాఫీ చేయాలని, వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# మళ్లీ తెరపైకి ఫసల్ బీమా

- అమలు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలోని లక్షా 78 వేల మంది రైతులకు లబ్ధి
- బీఆర్ఎస్ సర్కారు హయాంలో నీరుగారిన పథకం
- కౌలు రైతులకు వర్తింపుపై సందేహాలు



మంచిర్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి సమయాల్లో పంట నష్టానికి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం మళ్లీ తెరపైకి వస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల పంట బీమా పథకంపై విధివిధానాలు రూపొందించాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వడగండ్ల వానలు కురిసినప్పుడు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వపరంగా అన్నదాతలను ఆదుకోవాలనే ప్రక్రియ కాంగ్రెస్ హయాంలో తెరపైకి వచ్చింది. ఫసల్ బీమా ద్వారా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

## బీఆర్ఎస్ సర్కారు వైఫల్యం

పంట బీమా పథకాన్ని గత ప్రభుత్వాలు అమలు చేయడం ద్వారా అన్నదాతలకు నష్టపరిహారం లభించేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో సైతం ఈ పథకం యేటా అమలులో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పథకం నీరుకారగా, బీమా అమలుకాక కొన్నేళ్ళుగా రైతులు నష్టపోతున్నారు. పంట బీమా కోసం ప్రభుత్వం తన వాటా ధనాన్ని వెచ్చిస్తుండగా, రైతులు సబ్సిడీ కింద నామమాత్రపు ప్రీమియం చెల్లించేవారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న పలు ఇన్సూరెన్స్ కంపెనీలు సాగు సమయంలో రైతులకు బీమా వర్తింపజేసేవి. ప్రకృతి వైపరీత్యం ద్వారా నష్టం వాటిల్లినప్పుడు బీమా అమలుతో రైతులు నష్టపరిహారం పొందేవారు.

## లక్షా 78వేల మంది రైతులకు లబ్ధి

పంట బీమా వర్తింపజేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని లక్షా 78వేల మందికి లబ్ధి చేకూరనుంది. జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్‌ల్లో యేటా దాదాపు 3.5 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి సాగు చేస్తుండగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా చేతికి వచ్చిన పంట నీట మునగడం సర్వ సాధారణమైంది.

యేటా వందల ఎకరాల్లో పంటలు నీట మునుగుతుండగా వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించేవారు. ఎకరాకు సగటున రూ.30 వేల నష్టం వాటిల్లితే అధికారుల నివేదిక ఆధారంగా రూ. 10వేల చొప్పున పరిహారం అందజేసేవి. దీంతో కొంత రైతులకు మేలు జరిగేది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఫసల్ బీమా పథకం నిర్వీర్యం కాగా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందకుండా పోయాయి.

## కౌలు రైతులకూ వర్తించేనా?

ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తిరిగి ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. వ్యవసాయ రంగంపై రైతులతోపాటు కౌలు రైతులు కూడా ఆధారపడి ఉన్నారు. జిల్లాలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన పలువురు రైతులు ఇక్కడ నివాసం ఉంటూ వరి, పత్తి, తదితర పంట లను సాగు చేస్తున్నారు. బెల్లంపల్లి, మందమర్రి, హాజీపూర్ మండలాల్లో వలస రైతులు వేల ఎకరాల్లో భూములు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులతోపాటు కౌలు రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో కౌలు రైతులు దాదాపు ఎనిమిది వేల వరకు ఉంటారని అంచనా. కౌలు రైతులకు కార్డులు ఇచ్చి పంట బీమా పథకంలో భాగస్వాములను చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

### పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి



సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి

వేమనపల్లి, మే 17: గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. శుక్రవారం నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపెల్లి, గొర్లపల్లి, రాజారాం, వేమనపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులు, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనాల్లోని మొక్కలను సంరక్షించాలని, సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్, సిరాజ్, పోశన్న, సురేష్, సాయి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### ప్రైవేటు ఐటీఐలపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, మే 17: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని ఐటీఐ జిల్లా కన్వీనర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు ఐటీఐలు పరీక్షల ఫీజుల పేరుతో విద్యార్థులు వెయ్యి రూపాయలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయన్నారు. కొన్ని ఐటీఐలు తరగతులు నిర్వహించడం లేదని, కనీస వసతులు కూడా లేవన్నారు. ఫీజులకు సంబంధించి సరైన రశీదులు ఇవ్వకుండా తెల్లకాగితంపై రాసి ఇస్తున్నారన్నారు. నిబంధనలను అతిక్రమిస్తున్న వాటి గుర్తింపు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీలు పాల్గొన్నారు.

### ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శిగా వెంకటేష్



వెంకటేష్‌తో రాష్ట్ర, జిల్లా కార్యదర్శి

బెల్లంపల్లి, మే 17: ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శిగా పసులేటి వెంకటేష్ నియమితులయ్యారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్‌లు వెంకటేష్‌కు నియామక పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా పార్టీలో, యువజన సంఘంలో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి వెంకటేష్ పోరాటాలు చేశారని తెలిపారు. పద్మ, లక్ష్మీ, రాజారాం, ఆకాష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నెన్నెల, మే 17: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎస్ఈఈ శ్రావణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. నెన్నెల, ఆవడం విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. 33/11 కేవీ విద్యుత్ లైన్‌లపై ఉండే చెట్ల కొమ్మలను తొలగించుకోవాలన్నారు. వేలాడే తీగలు, పాత స్తంభాలను గుర్తించి సరి చేయాలన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ. 1.50 కోట్లతో నెన్నెల మీదుగా కన్నెపల్లి-ఆవడం ఫీడర్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. బెల్లంపల్లి రూరల్ ఏడీఈ రాంచందర్, నెన్నెల ఏఈఈ మల్లయ్య ఉన్నారు.

### ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పనులు కల్పించాలి

మందమర్రిరూరల్, మే 17: ఉపాధిహామీ కూలీలకు ఎక్కువ రోజులు పనులు కల్పించాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సారంగపల్లి తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కూలీలు పనులకు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. కూలీలకు పనుల వద్ద తగు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తిరుమల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తపోటుపై అందరికీ అవగాహన ఉండాలి

నస్పూర్, మే 17: ప్రతిఒక్కరూ రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకుంటే ప్రభుత్వ పరంగా మందులు ఉచితంగా ఇస్తామని జిల్లా వైద్యాధికారి అనిత అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రక్తపోటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 15రోజులకు ఒకసారి ఉపకేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 30 సంవత్సరాలు కలిగి ఉన్న వారందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు నీరజా, శివప్రతాప్, కిరణ్, సమత, సీహెచ్ఓ సుమన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## రైతులను కలవరపెడుతున్న వర్షాలు

నస్పూర్, మే 17 : జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నస్పూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున వర్షంతో పాటు సాయంత్రం నుంచి చినుకులు పడుతున్నందున ఆరబోసిన ధాన్యం కొంత తడిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలపై కవర్లు కప్పిపెట్టారు. సీతారాంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తరలించడానికి లారీలు సకాలంలో రాకపోవడంతో నాలుగు లారీల లోడు ధాన్యం బస్తాలు కేంద్రంలో ఉండిపోయాయి.

నస్పూర్ గోదావరి తీరంలో రైతు మల్లయ్యకు చెందిన కోతకు వచ్చిన వరి గాలి వానకు నేలవాలింది. పంట పొలాల వద్ద ఉన్న ధాన్యంను ఆఘమేగాలపై రైతులు తూకం వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉరుములు, మెరుపుల తో కూడిన వర్షం కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను త్వరగా పంపించాలని రైతులు కోరుతున్నారు.



గోదావరి నది సమీపంలో నేలవాలిన వరి పంట, కళ్ళాల వద్ద ధాన్యం తూకం

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, మే 17: కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటపల్లి, ఆల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

**వేమనపల్లి:** మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దీక్షిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీల్వాయి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**జైపూర్:** జైపూర్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

నెన్నెల, మే 17 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జోగాపూర్, చిత్తాపూర్ కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నామన్నారు. కొనుగోలు సమయంలో రైతుల, ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యం తరలించేందుకు సరిపడ గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించి వెంటనే అన్‌లోడ్ అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఉన్నారు.

**బెల్లంపల్లి:** ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైసుమిల్లులకు తరలించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మండలంలోని చంద్రవెల్లి, చాకెపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కేంద్రాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. కేంద్రాల సిబ్బంది కొనుగోలు చేసిన రైతుల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసి నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**భీమారం:** మండలంలోని పోలంపల్లి, సుంకరిపల్లి, భీమారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంచిర్యాల ఆర్డీవో రాములు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని వెంటనే కాంటా చేసి మిల్లులకు పంపించాలన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ఎత్తు ప్రాంతంలో వడ్లు పోయాలని సూచించారు. తహసీల్దార్ సదానందం, కేంద్రాల ఇన్‌చార్జీలు ఉన్నారు.

**మందమర్రిరూరల్:** సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



జోగాపూర్‌లో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్, చంద్రవెల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

## కాలువలో ట్రాలీ ఆటో బోల్తా

- 16 మంది ఉపాధిహామీ కూలీలకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



కాలువలో బోల్తా పడిన ట్రాలీ ఆటో, అంబులెన్స్‌లో ఉపాధిహామీ కూలీల తరలింపు, తీవ్రంగా గాయపడిన మల్లవ్వ

దండేపల్లి, మే 17: ఉపాధిహామీ పనులు ముగించుకొని ఆటో ట్రాలీలో ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో ఆటో బోల్తా పడడంతో పలువురు కూలీలు గాయపడ్డారు. దండేపల్లి గ్రామానికి చెందిన 19 మంది ఉపాధిహామీ కూలీలు శుక్రవారం ఉదయం కడెం ప్రధాన కాలువలో పూడికతీత పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి ఆటో ట్రాలీ (టీఎస్ 19టీ 6132) కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి వస్తుండగా అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ప్రమాదంలో 16 మందికి గాయాలుకాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, 12 మందిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో మోటపల్యుల భాగ్యలక్ష్మికి ఎడుమ చేయి విరగగా, గోట్ల విజయకు తల, నడుముకు, జ్యోతి తలకు గాయాలయ్యాయి. బంగారు మల్లవ్వ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించారు. ఇమ్మిడిశెట్టి లత, గోప హేమ, వేమునూరి శైలజ, సుకన్య, ఎనగందుల స్వప్న, అనిత, సిరిపురం సువర్ణ, అయ్యోరి మహేశ్వరీ, బండారి కళావతి, పెండ్యాల గంగన్న, ముస్కె సునీత, బొమ్మెన సుజాత, గొట్ల లక్ష్మిలకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు.

### కూలీలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



గాయపడిన వారిని పరామర్శిస్తున్న దివాకర్‌రావు

ఏసీసీ: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధిహామీ కూలీలను మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపాధి హామీ కూలీలు ట్రాలీ ఆటో బోల్తాపడడంతో పలువురికి గాయాలయ్యాయి. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు సూచించారు.